# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 21-11-2024 సంపుటి : 06 సంచిక : 53 పేజీలు : 8 వెల : రూ 3-00


## టిడిపి వైపు వైసిపి అసమ్మతి నేతల దృష్టి

గుంటూరు,నవంబర్20 : వైసిపిలో నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతిని తమకు అనుకూలంగా మలచుకోవాలని అధికార టిడిపి యోచిస్తోంది. ఇంతకాలం జగన్ నాయకత్వానికి ఎదురులేదని అంతా భావించారు. అయితే ఇదంతా పదవులు ఉన్నంత వరకే అన్నది స్పష్టం అయ్యింది. ఆయా జిల్లాల్లో అసమ్మతి సెగలు మెల్లగా బయటకు వస్తున్నాయి. టిడిపి జోరు పెంచడంతో కొందరు అందులో చేరుతున్నారు. రేపు పదవి రాదు..జగన్ మళ్లీ అధికారంలోకి రాడనుకున్న వారు ఇప్పటి న లేదని నాయకులు ప్రకటించుకున్నా.. రాజకీయాల్లో ఇదంతా సమజంగానే చూడాలి. ఆయా జిల్లాల్లో ఉన్న నేతల గురించి టిడిపి ఆరా తీస్తోందని సమాచారం. మరోవైపు అసంతృప్తితో ఉన్న వారి దారెటన్నది ఇప్పుడు చర్చిస్తున్నారు.






# ప్రజానమ్మకాన్ని ఒమ్ముచేయను...

**గెలిచినా.. ఓడినా ఇక్కడే ఉంటా**
**ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నా**
**వైసీపీ పాలనలో రాష్ట్రం దివాళా**
**అప్పుల ఊబిలో తీసుకెళ్లిన జగన్**
**నాలుగు దశాబ్దాలుగా నన్ను ఆదరిస్తూ వస్తున్నందుకు ధన్యవాదాలు**
**ఇప్పుడిప్పుడే రాష్ట్రం కుదుటపడుతుంది : ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు**



అమరావతి, నవంబర్ 20(( విభారె) : గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన విజయాన్ని తాను ఎన్నడూ మరిచిపోనని, ఏపీ చరిత్రలో ఎప్పుడూ చూడని ప్రజాతీర్పు వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజల తిరుగుబాటు కనిపించిందని తెలిపారు. "నాలుగు దశాబ్దాలుగా నన్ను ఆదరించారు. అందరికంటే ఎక్కువ సార్లు నన్ను ప్రజలు సీఎం చేశారు. ఎన్నో ఇబ్బందులు పెట్టారు.. జైలుకు కూడా పంపారు. బాంబు దాడి నుంచి శ్రీవారే నన్ను కాపాడారు. నేను ఏ తప్పూ చేయలేదు. సీఎం అయ్యాక రాష్ట్రాన్ని బాగు చేస్తారా.. చేయగలుగాతాము అనే నమ్మకం ఉందా అని పలువురు నన్ను అడిగారు. నేను పారిపోను.. పారిపోలేను. అధికారం ఉన్నా.. అధికారం లేకపోయినా ప్రజల కోసమే పనిచేశాను. ఇప్పుడు కూడా ప్రజలు తీర్పు ఇచ్చి నన్ను గెలిపిస్తే.. అభివృద్ధి చేసి తీరుతాను అని ప్రతిజ్ఞ చేసి ముందుకు వచ్చాను" అని సీఎం పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. రాత్రికి రాత్రి ఏదీ జరిగిపోదన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వెంటిలేటర్‌పైకి వెళ్లిందన్నారు. కీలక సమయంలో ప్రజలు ఘన విజయం అందించారని చెప్పారు. ఢిల్లీలో పరపతి పెరిగిందని.. కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. రాష్ట్రం ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందన్నారు. 64 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే పెన్షన్లు రూ.4వేలకు పెంచామని చెప్పారు. విజయవాడ వరదల సమయంలో సీఎం సహాయనిధికి రూ.500 కోట్లు విరాళంగా వచ్చాయన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, తప్పులు శాపాలుగా మారాయన్నారు. ఎంత తవ్వితే అన్ని తప్పులు బయటపడుతున్నాయన్నారు. వైసీపీ అప్పులతో ఏపీ వెంటిలేటర్‌పైకి వెళ్లిందని విమర్శించారు. వైసీపీ పాలనలో రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారని.. అప్పులపై లెక్కలతో సహా అసెంబ్లీలో చూపించామని అన్నారు. "వైసీపీ పాలనలో నా కుటుంబంపై ఆరోపణలు చేశారు. అధికారం కొత్త కాదు.. కేంద్ర రాజకీయాలు నాకు కొత్త కాదు. రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతో సంక్షేమం మొదలుపెట్టాం. రూ.30 తో మొదలైన పెన్షన్... ఇప్పుడు రూ.4 వేలు చేశాం" అని అన్నారు. పేదల కోసం అనేక సంస్కరణలు, పథకాలు తీసుకొచ్చామని వెల్లడించారు. సంక్షేమ పథకాలు ప్రారంభించిన ఘనత టీడీపీదే అని అన్నారు. పేదలకు పక్కా ఇళ్లు నిర్మించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. టీడీపీ పాలనలో 120 సంక్షేమ పథకాలు ప్రారంభించామని తెలిపారు. ఏపీలో సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం తనకు ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 150 రోజులు పూర్తి అయ్యిందని.. 150 రోజుల్లో తమ ప్రభుత్వం చేసిన పనులు చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతిక్షణం ప్రజల కోసమే పరితపిస్తా అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఇప్పటికే రాష్ట్రంలో 101 అన్నా క్యాంటీన్‌లు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తామని సీఎం తెలిపారు. బెజవాడలో వరద సమయంలో రూ.500 కోట్ల విరాళాలు వచ్చాయని.. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలు కూడా స్పందించారన్నారు. ఏపీలో బుక్ చేసుకున్న వారందరికీ గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం చెత్త పన్ను వేసింది కానీ.. చెత్త ఎత్తలేదని విమర్శించారు. ఏపీలో 83 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పెరుకుపోయిందని తెలిపారు. "మేం చెత్తపన్ను రద్దు చేశాం.. చెత్తను తీయిస్తున్నాం" అని తెలిపారు. అమరావతి కొనసాగి ఉంటే రాష్ట్రానికి ఆదాయం వచ్చేదని.. అయినా కూడా అమరావతికి పూర్వవైభవం తీసుకువస్తామని స్పష్టం చేశారు. పెట్టుబడులు ఆకర్షించడానికి చేయాల్సిన పనులు చేస్తున్నామన్నారు. వైసీపీ పాలనలో రోడ్లన్నీ గుంతలు పెట్టి వెళ్లారని మండిపడ్డారు. గ్రామాల్లో ఉండాలంటే ప్రజలకు కూడా విరక్తి పుట్టే పరిస్థితి వచ్చిందన్నారు. రోడ్ల గుంతలు పూడ్చడానికి రూ.860 కోట్లు విడుదల చేశామన్నారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని రోడ్లు తయారుచేస్తామని వెల్లడించారు. రోడ్ల నిర్మాణానికి వినూత్న ఆలోచనలతో ముందుకెళ్తున్నామన్నారు. రూ.75 వేల కోట్లతో ఏపీలో నేషనల్ హైవే పనులు జరుగుతున్నాయని.. రూ.30 నుంచి 40 వేల కోట్ల పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. అమరావతి రైల్వే లైన్‌కు కూడా కేంద్రం సహకరించిందని చెప్పుకొచ్చారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ప్రకటించామని.. పరిశ్రమల కోసం 25 పాలసీలు తీసుకొచ్చామన్నారు. ఏపీలో రూ.85 వేల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఎన్‌టీపీసీ, జెన్‌కో జాయింట్ వెంచర్‌తో విశాఖలో లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నారని.. రూ.65 వేల కోట్ల పెట్టుబడులతో రిలయన్స్ బయోగ్యాస్ రాబోతోందన్నారు. రిలయన్స్ బయోగ్యాస్‌తో రెండున్నర లక్షల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. కరుడుగట్టిన నేరస్తులకు ఏపీలో స్థానం లేదన్నారు. ఆడబిడ్డల జోలికి వస్తే ఏం చేయాలో అది చేస్తామని.. ఆడబిడ్డల జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ వల్లే అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని.. నేరాలు చేస్తే తాట తీస్తామని, దోషులకు శిక్షల విషయంలో రాజీలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# ఎనిమిదవ రోజుకు చేరిన ఏపీ అసెంబ్లీ సమావేశాలు

### ప్రశ్నోత్తరాల సమయంలో అయోమయం




అమరావతి,నవంబర్ 20 ( విభారె) : ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఎనిమిదవ రోజుకు చేరుకున్నాయి. సభ మొదలవగానే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అయితే ప్రశ్నోత్తరాల విషయంలో సభలో అయోమయం నెలకొంది. ఒక శాఖకు సంబంధించిన ప్రశ్నలు వేరే శాఖలకు వెళ్లడంపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఉభయసభల్లో మంత్రికి ఒకే ప్రశ్న రావడంపైనా మండిపడ్డారు స్పీకర్. ఈ అయోమయానికి కారణం అధికారుల నిర్లక్ష్యమే స్పీకర్ ఆగ్రహించారు. అధికారులు తమ శాఖకు వచ్చిన ప్రశ్నలను వేరే శాఖలకు ఎలా పంపుతారంటూ స్పీకర్ ప్రశ్నించారు. ఇళ్ళ స్థలాల, ఇళ్లు పంపిణీకి సంబంధించిన ప్రశ్న రెవెన్యూకు ఎలా వేస్తారని స్పీకర్ అడిగారు. అధికారులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే గోదావరి పుష్కరాల పనులు విషయంలో జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకు ప్రశ్న వెళ్లింది. ఇదే సమయంలో మండలిలో గాలేరు నగరి, హంద్రీనీవా అనుసంధాన ప్రాజెక్టుపై ప్రశ్న ఇచ్చారు. దీనిపైనా స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే మంత్రికి ఉభయసభల్లో ఎలా ప్రశ్న వేస్తారనే క్వశ్చన్ చేశారు. ఉభయ సభల్లో మంత్రికి ఒకే సమయంలో ప్రశ్న రావడంపై విస్మయం వ్యక్తం చేశారు. అధికారుల పనితీరుతో ప్రశ్నత్తరాల సమయంలో సభలో కాసేపు అయోమయ పరిస్థితి నెలకొంది.

కాగా.. శాసనసభ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు మంత్రులు సమాధానం ఇవ్వనున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతిపై సంతాప తీర్మానం చేయనున్నారు. రూల్ 344 కింద కూటమి ప్రభుత్వం 150 రోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శాసన సభలో చర్చించనున్నారు. ఈరోజు సభలో పలు బిల్లులను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నారు. విశాఖ రుషికొండపై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై స్వల్పకాలిక చర్చ జరుగనుంది. అలాగే నూతన మద్యం పాలసీపై సభలో మంత్రి కొల్లు రవీంద్ర స్టేట్‌మెంట్ ఇవ్వనున్నారు.


# ఆ ఇద్దరినీ అరెస్టు చేయాల్సిందే..

## వైఎస్ షర్మిల డిమాండ్




అమరావతి నవంబర్ 20( విభారె) ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న పలు ఘటనలపై కూటమి ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. సోషల్ మీడియాలో గత ఐదేళ్లుగా పోస్టులతో రెచ్చిపోయిన ప్రతీ ఒక్కరినీ టార్గెట్ చేస్తోంది. అయితే ఇందులో కొందరిని మాత్రం చూసీ చూడనట్లుగా వదిలేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ సోషల్ మీడియా ఇన్ చార్జ్ సజ్జల భార్గవ్ రెడ్డి లాంటి వారిపై చర్యలు లేవని విమర్శలు వస్తున్నాయి.దీనిపై ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల స్పందించారు. తన తల్లి విజయమ్మ, సోదరి సునీతపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించిన వ్యవహారంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పాత్ర ఉందని పోలీసులు నిర్ధారణకు వచ్చినా ఇప్పటివరకూ వారిని ఎందుకు అరెస్టు చేయడం లేదని షర్మిల ప్రశ్నించారు. వైసీపీ సైకో వర్రా రవీందర్ రెడ్డితో తమపై పోస్టులు పెట్టించిన అవినాష్ రెడ్డిని అరెస్టు చేసి విచారించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ అనుచిత పోస్టులకు కారణమైన సజ్జల భార్గవ్ రెడ్డిని కూడా అరెస్టు చేయాలన్నారు. సోషల్ మీడియాలో పోస్టుల వ్యవహారంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇప్పటికే వైఎస్ షర్మిల స్వాగతించారు. గతంలో తమపై పోస్టులు పెట్టిన వారందరినీ శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం చిన్న చేపల్ని పట్టుకుని పెద్ద చేపల్ని వదిలేస్తుందన్న భావనలో షర్మిల ఉన్నారు. అందుకే వైఎస్ అవినాష్ రెడ్డితో పాటు సజ్జల భార్గవ్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని ఆమె ఇవాళ డిమాండ్ చేశారు.

# వామ్మో.. దూసుకొస్తున్న మరో తుఫాన్ ముప్పు..



అమరావతి,నవంబర్ 20 ( విభారె) )ఆంధ్రప్రదేశ్‌ను గత కొన్నాళ్లుగా వరుసగా తుఫాన్‌లు వెంటాడుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు, ఆవర్తనాలతో ఏపీలో భారీ వర్షాలు దంచికొట్టాయి.

తాజాగా.. ఏపీకి తుఫాన్ ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల చివరిలో దక్షిణ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని తెలిపింది. 23న అల్పపీడనం ఏర్పడి.. 27 నాటికి తుఫాన్‌గా బలపడనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెల 28లోపు చెన్నై, నెల్లూరు మధ్య తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని చెప్పింది. ఈ తుఫాన్ ప్రభావంతో 24 నుంచి రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. 27, 28, 29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది.ఇక.. గత వారం కూడా నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. అల్పపీడనం ప్రభావంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం పడింది. నెల్లూరు, గూడూరు, సూళ్లూరుపేట, కావలి భారీ వర్షంతో పలుచోట్ల వాగులు, వంకలు పొంగి పొర్లాయి. అంతకుముందు.. గత నెలలో బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్.. బీభత్సం సృష్టించింది.తాజా తుఫాన్ హెచ్చరికలతో రైతుల్లో అలజడి రేగుతోంది. ఏపీ వ్యాప్తంగా పలు జిల్లాల్లో వరి పంట చేతికొచ్చే దశకు చేరుకుంది. ఈ సమయంలో తుఫాన్ వస్తే.. తమకు పంట నష్టం తప్పదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తు?న్నారు.

# సంపాదకీయం

గురువారం 21-11-2024

## ఢిల్లీ నగరానికి ఏమైంది...

**ప్రతి ముగ్గురిలో ఒక అస్తమా, శ్వాసకోస వ్యాధి**

ఢిల్లీ ప్రాణాపాయంగా మారింది. ఢిల్లీ నగరం ఇప్పుడు గ్యాస్ ఛాంబర్‌లో మగ్గిపోతుంది. అక్కడ ఒక గంట గాలి పీలిస్తే చాలు, వరుసగా పది సిగరేట్లు తాగినంత కిక్ వస్తుంది. దానితో పాటు క్యాన్సర్ కూడా ఖాయమవుతుంది. అదీ ఢిల్లీ పరిస్థితి! ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిమితికి 50 రెట్లు అధికంగా ఢిల్లీ కాలుష్యం ఆందోళన కలిగిస్తుంది.రాజధాని నగరంలో గంట గాలి పీలిస్తే మీ జీవితంలో ఒకరోజును బలిచ్చినట్టే లెక్క! దుప్పటిలా కప్పేసే పొగ మంచులో క్యాన్సర్ కణాలు కోకొల్లలుగా ఉన్నాయి. శ్వాస తీసుకుంటే విషయం తాగినంత ప్రమాదం. ఢిల్లీలో బతకడమే ఒక నరకంగా ఉందంటే నమ్ముతారా?! నమ్మక తప్పదు. ఎందుకంటే, ఢిల్లీలో నివశిస్తున్న ప్రతి ముగ్గురు పిల్లల్లో ఒకరికి ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులున్నాయి. అంతెందుకు, ఇంకా పుట్టని బిడ్డకు కూడా ఢిల్లీ గాలి ప్రాణాంతకంగా మారుతోంది. పేరుకే రాజధాని నగరం, అక్కడ జీవితం చాలా ప్రమాదకరం.ప్రస్తుతం, నగరంలో రోడ్లన్నీ ఖాళీగా ఉన్నాయి. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దుంటూ సూచనలు వెళ్లాయి. స్కూళ్లూ, కాలేజీలు, ఆఫీసులు చివరికి భారత అత్యున్నత న్యాయస్థానం కూడా తలుపులు మూసుకోవాల్సి వచ్చింది. అందరూ, అన్ని పనులూ ఇంటి దగ్గర నుండే! ఆన్ లైన్ క్లాసులు? వర్క్ ఫ్రమ్ హోమ్‌లు! పొరపాటున బయటకొస్తే.. గుండెల నిండా విషం నింపుకొని వెళ్లాల్సిందే! ఊపిరితిత్తుల్లో క్యాన్సర్ కట్టుకుపోవాల్సిందే! దేశ రాజధాని ఎందుకంత విషతుల్యంగా మారింది? ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయ్? అసలు, ప్రజలు ఎలా బతుకుతున్నారు? అందరి మైండ్‌లో ఇప్పుడు ఇవే ప్రశ్నలు.ప్రపంచంలోనే అత్యధిక వాయు కాలుష్యం ఉన్న నగరం భారత రాజధాని ఢిల్లీ. ఇక్కడ వాయు కాలుష్యం వల్ల ప్రజల ఆయుర్దాయం 10 ఏళ్ళు తగ్గిపోతోందని గతంలో పలు నివేదికలు కూడా వెళ్లడించాయి. అయినా, ఢిల్లీ కాలుష్యంలో మార్పు రాలేదు సరికాదా.. నానాటికీ పెరుగుతూనే ఉంది. ఈ వాయుకాలుష్యం కారణంగా ఢిల్లీలో ప్రజారోగ్యం విషయంలో హెల్త్ ఎమర్జెన్సీ ఏర్పడింది. శ్వాసకోశ వ్యాధులతో వేలాది మంది రోగులు ఆస్పత్రుల బాటపడుతున్నారు.ప్రపంచంలోనే అత్యంత కాలుష్యపూరితమైన గాలిని పీలుస్తూ అక్కడి ప్రజలు అల్లాడిపోతున్నారు. ప్రస్తుతం, రాజధాని ఢిల్లీ పూర్తిగా విషపూరిత పొగమంచుతో కప్పబడి, ఉక్కిరిబిక్కిరి అవుతోంది. న్యూ ఢిల్లీలో విషపూరిత ఖఓ 2.5 స్థాయి 247 మైక్రోగ్రాములు ఉంది. ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన 15 మైక్రోగ్రాముల కంటే చాలా చాలా ఎక్కువగా ఉంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ప్రకారం, 500 గరిష్ట స్థాయితో అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ వాతారవణంలో ఢిల్లీ వాసుల్లో నిరంతరం దగ్గు, జలుబు, జ్వరం, శ్వాస ఇబ్బందులతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా ఢిల్లీ శీతాకాలం ముప్పులో చిక్కుకుంది. అయితే, ఇది వరకూ ఎప్పుడూ లేనంత డేంజరస్‌గా ఈ పరిస్థితి ఉంది. నిజానికి, రాజధానిలో వాయు కాలుష్యం ఏడాది పొడవునా ఉన్నప్పటికీ శీతాకాలంలో చలితో పాటుగా మరింత విజృంభిస్తుంది. అందుకే, శీతాకాలం వచ్చిందంటే ఢిల్లీకి ప్రమాదం వచ్చినట్లే లెక్క.. చలితో పాటు వాయు కాలుష్యం రాజధాని నగరాన్ని చుట్టుముట్టేస్తుంది. పొగ మంచు ఊపిరాడకుండా చేస్తుంది. గ్యాస్ ఛాంబర్‌లో నగరం విలవిలా కొట్టుకుంటుంది. ప్రతీ ఏడాది ఢిల్లీకి ఇదే సమస్య. నవంబర్ నుండి జనవరి దాటే వరకూ ఢిల్లీ నివాసయోగ్యం కాదనే చెప్పాలి.ప్రపంచంలో అత్యంత పొల్యూటెడ్ నగరాల్లో అగ్ర స్థానంలో ఉన్న ఢిల్లీ ఈ రోజుల్లో తీవ్రమైన వాయు కాలుష్యంతో నిండిపోతుంది. పరిష్కరించే మార్గాలు ఎన్నున్నా.. అమలులో మాత్రం మీనమేషాలు లెక్కించే పరిస్థితి. ఢిల్లీని పాలిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ? ఆరోపణలు, ప్రత్యారోపణలతోనే కాలం వెళ్లదీస్తారు. అందుకే, శీతాకాలంలో ఢిల్లీ వాసులంతా సొంతగా తమ జాగ్రత్తలు తాము పాటించడానికి సిద్ధమవుతారు. ఇప్పుడు ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ చూస్తే ఇంత దారుణమైన వాతావరణంలో ప్రజలు బతుకుతున్నారా అని ఆశ్చర్యం వేస్తుంది.ప్రస్తుతం ఢిల్లీ ఎయిర్ క్వాలిటీ అత్యంత ప్రమాదకరంగా ఉంది. మొన్న గాలి నాణ్యత పేలవంగా ఉంటే.. నిన్న ప్రమాదకరంగా.. ఈరోజు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఇది సివియర్ ప్లస్ కేటగిరీని సూచిస్తుంది. ఇక ఇంతకుమించి ప్రమాదం ఏదైనా ఉందంటే అది ప్రాణాలు కోల్పోవడమే అనుకోవాలి. అవును, ఇందులో అతిగా చెబుతుంది ఏమీ లేదు. పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందంటే? అసలు, దేశ రాజధానిగా ఢిల్లీ ఉండటం అవసరమా? అని తాజాగా కాంగ్రెస్ నేత శశీథరూర్ ప్రభుత్వాలని ప్రశ్నించారు, ప్రస్తుతం ఢిల్లీ గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయిలో 500 మార్క్‌ను చేరుకోవడమే. నవంబర్ 19 ఉదయం, ఢిల్లీ రాజధాని ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 494గా నమోదైంది. దాదాపు ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఉంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం. ఇక్కడ అతి తక్కువగా ద్వారకలో 480 నమోదయ్యింది. 400 మార్కే డేంజరస్ కాగా.. అది దాటిందంటే ఎంత తీవ్రమైన ప్రభావం ఉంటుందో ఊహించొచ్చు. ఢిల్లీ వ్యాప్తంగా కాలుష్యం తీవ్ర స్థాయికి చేరడంతో ప్రజలు కళ్ల మంటలు, దురద, గొంతు నొప్పితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఒక్కసారి ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌లో ఎంత స్థాయిలో ఉంటే ఎలాంటి ప్రభావం ఉంటుందో చూద్దాం.. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అనేది బాహ్య గాలి నాణ్యత, ఆరోగ్యం గురించి సమాచారం ఇచ్చే ఈపీఏ సాధనంగా పరిగణిస్తారు.

## తప్పనిసరిగా ఓటు వేసేలా చట్టం చేయాలి : కేంద్ర మంత్రి అథవాలే

న్యూఢిల్లీ: దేశంలోని ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకునేలా చట్టం తీసుకురావాలని కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే అన్నారు. మహారాష్ట్ర లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మందకొడిగా కొనసాగుతుండటంపై ఆయన స్పందించారు. ఉదయం 11 గంటల వరకు కేవలం 18 శాతం పోలింగ్ మాత్రమే నమోదు కావడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు.ఎన్నికల ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా కొనసాగుతున్నాయని, కానీ ఓటింగ్ శాతం మందకొడిగా సాగుతుండటం ఏం బాగలేదని రాందాస్ అథవాలే వ్యాఖ్యానించారు. ఓటింగ్ శాతం మరింత పెరగాలని, ఓటు హక్కు ఉన్న ప్రతి వ్యక్తి తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓ చట్టం రూపొందించాలని అభిప్రాయపడ్డారు.'ఇక ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ఎవరిది..?' అని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. విజయం తమదేనని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలోని మొత్తం 288 సీట్లకుగాను 165 నుంచి 170 స్థానాలు అధికార మహాయుతి కూటమి గెలుస్తుందని చెప్పారు. స్పష్టమైన మెజారిటీతో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు.




## కాంగ్రెస్ నేత పీ చిదంబరానికి ఊరట..

**ట్రయల్ కోర్టు విచారణపై ఢిల్లీ హైకోర్టు స్టే**



న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ దాఖలు చేసిన ఎయిర్ సెల్ ? మ్యాక్సిస్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత పీ చిదంబరానికి ఢిల్లీలో హైకోర్టు ఊరటనిచ్చింది. ట్రయల్ కోర్టు విచారణపై ఢిల్లీ హైకోర్టు బుధవారం స్టే విధించింది. కాంగ్రెస్ నేత పిటిషన్‌పై ఈడీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మనీలాండరింగ్ కేసులో చిదంబరం, ఆయన తనయుడు కార్తీ చిదంబరంపై ట్రయల్ కోర్టులో ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకొని నోటీసులు జారీ చేసింది. కేసు విచారణను జనవరి 22కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ మనోజ్ కుమార్ ఓహ్రి పేర్కొన్నారు. ఈ కేసులో వివరణాత్మక ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిపారు.చిదంబరం తరఫున సీనియర్ న్యాయవాది ఎన్ హరిహరన్, అర్షదీప్ సింగ్ ఖురానా, అక్షత్ గుప్తా వాదనలు వినిపించారు. మాజీ కేంద్రమంత్రిపై ప్రాసిక్యూషన్‌కు ఎలాంటి అనుమతి లేకపోవడంతో ప్రత్యేక న్యాయమూర్తి మనీలాండరింగ్‌కు సంబంధించిన ఛార్జిషీట్‌ను పరిగణలోకి తీసుకున్నారని.. ఆయనపై వచ్చిన ఆరోపణలు అధికారిక విధులతో సంబంధం లేదని.. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌కు అనుమతి అవసరం లేదని ఈడీ న్యాయవాది అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ క్రమంలో మధ్యంతర ఉపశమనం కల్పించాలని.. ట్రయల్ కోర్టులో కొనసాగుతున్న విచారణపై స్టే విధించాలని చిదంబరం కోరారు. ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో చిదంబరం, కార్తీలపై సీబీఐ, ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌లపై ట్రయల్ కోర్టు నవంబర్ 27, 2021న విచారణ చేపట్టి, సమన్లు జారీ చేసింది.సీఆర్‌పీసీ సెక్షన్ 197 (1) ప్రకారం ప్రాసిక్యూషన్ కోసం అనుమతి పొందడం తప్పనిసరని.. ఈడీ ఇప్పటి వరకు ప్రాసిక్యూషన్‌కు అనుమతి తీసుకోలేదని చిదంబరం తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ప్రస్తుతం, అభియోగాల పరిశీలన కోసం ట్రయల్ కోర్టు ఎదుట ప్రొసీడింగ్స్ ఫిక్స్ అయ్యాయని లాయర్ తెలిపారు. 2006లో చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ ఒప్పందానికి (ఈఎఖః) అనుమతి లభించింది. ఆర్థిక మంత్రిగా చిదంబరం ఈ ఒప్పందాన్ని ఆమోదించేందుకు తనశక్తికి మించి ప్రయత్నించారని.. దాంతో కొందరికి లబ్ధి చేకూరిందనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై సీబీఐ కేసు నమోదు చేయగా.. మనీలాండరింగ్ నేపథ్యంలో ఈడీ సైతం రంగంలోకి దిగింది.

## జార్ఖండ్‌లో 5 ట్రక్కులకు నిప్పుపెట్టిన మావోయిస్టులు

రాంచీ: జార్ఖండ్‌లో ఇవాళ రెండో దశ అసెంబ్లీ పోలింగ్ జరుగుతున్నది. అయితే ఆ ఎన్నికలకు ముందే.. మావోయిస్టులుఅయిదు ట్రక్కులకు నిప్పు పెట్టారు. లతేహర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. హెరాంజ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న లాత్ అటవీ ప్రాంతంలో రాత్రి 1.30 నిమిషాలకు ఈ ఘటన జరిగినట్లు పోలీసులు చెప్పారు. లతేహర్‌లో బొగ్గు ప్రాజెక్టు వద్ద రవాణా కోసం వాహనాలకు నిప్పు పెట్టారు. బొగ్గును ఖాళీ చేసి తిరిగి వస్తున్న ట్రక్కులకు నిషేధిత జార్ఖండ్ ప్రస్తుతి కమిటీ నిప్పు పెట్టినట్లు తెలిసింది. ఘటన పట్ల విచారణకు ఆదేశించారు. వాహనాలను దగ్ధం చేసిన కేసులో తనిఖీలు చేపడుతున్నట్లు ఎస్పీ కుమార్ గౌరవ్ తెలిపారు. సంఘటనా స్థలం వద్ద కరపత్రాలను వదలి వెళ్లారు. ట్యూబ్డ్ కోల్ ప్రాజెక్టు వద్ద పనులు సాగాలంటే తమతో చర్చలు జరపాలని ఆ కరపత్రంలో మావోయిస్టులు పేర్కొన్నట్లు ఎస్పీ తెలిపారు.



## ఉపాధి హామీ పనుల్లో వేతనదారుల సంఖ్యను పెంచండి :జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 20-ఉపాధి హామీ పనుల్లో వేతనదారుల సంఖ్యను పెంచి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఏపీఓ, ఎంపిడిఓ లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ లక్ష్యాలు, ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సమావేశంలో డ్వామా పిడి జనార్ధన్ రావు, హౌసింగ్ పిడి వెంకటసుబ్బయ్య, ఈఈ హరిహర గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద వేతనదారులకు పనులు కల్పించడంలో పగిడ్యాల, కొత్తపల్లి, ఆత్మకూరు, డోన్, బేతంచెర్ల తదితర మండలాలు పూర్తిగా వెనుకబడి ఉన్నాయని.... గ్రామాలకు వెళ్లి మోటివేట్ చేసి వేతన దారులకు పనులు కల్పించి వచ్చే వారానికి ప్రగతిని కనపర్చాలన్నారు. ప్రతి కుటుంబానికి వందరోజుల పని దినాలు కల్పించడంలో కూడా వెనుకబడి ఉన్నామన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ కు సంబంధించి 2900 ఎకరాలకు కాను 2200 ఎకరాలు పూర్తి చేశారని మిగిలిన 700 ఎకరాలు పెండింగ్ లో వున్న మండలాలు వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామానికి రెండు చొప్పున ఫారం ఫాండ్స్, మండలానికి పది చొప్పున ఫిష్ ఫాండ్స్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. 850 పశువుల షెడ్ల నిర్మాణాలకు గాను 751 షెడ్లకు మాత్రమే పరిపాలన ఉత్తర్వులు మంజూరు చేస్తే 327 షెడ్లు మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయని మిగిలిన పశువుల షెడ్లు మూడు రోజుల్లో గ్రౌండింగ్ కావాలని కలెక్టర్ ఆదేశించారు. పూర్తయిన పనులకు మెటీరియల్ కాంపోనెంట్ కింద ఎక్స్పెండిచర్ బుక్ చేస్తే నిధులు విడుదలవుతాయన్నారు. ఉపాధి వేతన దారులకు సరాసరి వేతన రేటు పెరిగేలా పనులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అడిగితే తప్ప పనులు చేయలేని దృక్పథాన్ని మార్చుకొని నిర్దేశించిన లక్ష్యంపై దృష్టి సారించి ప్రగతి కనపరచాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.




## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అకస్మిక తనిఖీలు



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 20-నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా ఆర్ వెంకటరమణ బుధవారం బ్రహ్మణకొట్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రమును మరియు నందికొట్కూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రమును ఆకస్మికముగా తనిఖీ చేశారు . ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది సమయ పాలన తప్పని సరిగా పాటించాలని లేనిచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రము లోని ఓపి విభాగాన్ని మరియు అక్కడ వున్నటువంటి రోగులకు,వారికి అందె సేవలు మరియు చికిత్సలు,మందులు, వారి పట్ల వైద్యాధికారి మరియు వైద్య ఆరోగ్యసిబ్బంది గురించి విచారించారు . రికార్డులను. రిపోర్టులను తనిఖీ చేశారు . కాన్పు వార్డును పరిశీలించి కాన్పు కొరకు వచ్చే ప్రతి గర్భిణీ స్త్రీ ని వీలైనంత వరకు నార్మల్ కాన్పు అయ్యే విధముగా జాగ్రత్త వహించవలేనని మరియు మాతాశిశు సంరక్షణ చర్యలు తీసుకోవలేనని లేనిచో కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు . బాలింత స్త్రీ కి మరియు పుట్టిన బిడ్డకు అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టవలేనని మరియు వారికి రావలసిన రాయితీలు సరైన సమయములో అందించాలని సూచించారు.మందుల గది ని తనిఖీ చేసి అందులో రికార్డులను పరిశీలించారు.


## రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 20-రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా నంద్యాల జిల్లాలో "సేఫ్ ఇండియా" కార్యక్రమం సందర్భంగా, నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా గారి ఆదేశాల మేరకు, ట్రాఫిక్ సీఐ బి. మల్లికార్జున గుప్తా ఆధ్వర్యంలో రామనాథ రెడ్డి నగర్ వున్న చైతన్య స్కూల్ యాజమాన్యం సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ బి. మల్లికార్జున గుప్తా విద్యార్థులకు మరియు ఉపాధ్యాయులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సీట్ బెల్ట్ ఉపయోగించకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం మంచిది కాదన్నారు. అవగాహన కార్యక్రమం అనంతరం, సుమారు 250 మంది విద్యార్థులతో స్కూల్ నుండి పద్మావతి నగర ? శ్రీనివాస సెంటర్ వరకు ర్యాలీ చేసి మానవహారము నిర్వహించారు. ర్యాలీ సమయంలో విద్యార్థులు రోడ్డు భద్రతకు సంబంధించిన నినాదాలు చేసారు, ప్రజల దృష్టిని ఆకర్షించారు. ఈ ర్యాలీ ద్వారా స్థానిక ప్రజలకు రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యత తెలియజేయడం జరిగింది.ప్రజలకు పూలతో సందేశంర్యాలీ ముగింపు సమయంలో విద్యార్థులు వాహనదారులకు రోజాపూలు అందించారు.ఈ కార్యక్రమము నందు నంద్యాల్ ట్రాఫిక్ సిఐ బి మల్లికార్జున గుప్తా మరియు ట్రాఫిక్ సిబ్బంది మరియు చైతన్య స్కూల్ సిబ్బంది ఏ.జి ఏం జి. సురేశ్, ప్రిన్సిపల్ విజయ లక్ష్మి , వైస్ ప్రిన్సిపల్ బి రాధ, డీన్ దస్తగిరి , ప్రైమరీ ఇంచార్జ్ జి సరిత తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ కార్మికులకు సన్మానం

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 20-జోయా హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో షేక్ కరీముల్లా తన కూతురి పుట్టిన రోజు మరియు హజరత్ టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా 11 వార్డు చాంద్ బడా లోని పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం చేసారు. జోయా హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షుడు కరీముల్లా మాట్లాడుతు ప్రతిరోజు పారిశుద్ధ కార్మికులు సూర్యోదయం కాకముందే నిద్రలేచి పట్టణాలను మరియు మన వార్డులను శుభ్రపరచి మరియు మురికి కాలువలలోని చెత్తాచెదారాన్ని తొలగించి వారి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను అందరూ గుర్తించాలన్నారు. కరోనా సమయంలో కూడా ఎంతో ముఖ్యపాత్ర పోషించిన పారిశుద్ధ కార్మికులను ప్రతి ఒక్కరు గౌరవించాలని సూచించారు. ఆరోగ్య విషయంలో మరియు వారి సమస్యలపై ప్రభుత్వ అధికారులు మరియు ప్రజలు స్పందించి వెంటనే ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపాలిటీ శానిటేషన్ సూపరైజర్ మురళీధర్. లక్ష్మీనారాయణ , 11 వార్డు సచివాలయ అడ్మిన్ సెక్రటరీ మక్బుల్ హుస్సేన్ , సెక్రటరీ సంజీవ , మరియు సచివాలయ సిబ్బంది, వార్డు పారిశుద్ధ కార్మికులు, జోయా హెల్పింగ్ హాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.







# మెగా సిటీతో మారనున్న రూపురేఖలు

గుంటూరు, నవంబర్ 20, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత అమరావతికి మంచి రోజులు వచ్చాయి. ఇప్పటికే కీలక ప్రాజెక్టులు మంజూరు అయ్యాయి. వాటికి సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మెగా సిటీని అభివృద్ధి చేయాలని ప్లాన్ చేస్తోంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్థికంగా ఎదగడానికి వడివడిగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే అమరావతిపై ఫోకస్ పెట్టిన కూటమి ప్రభుత్వం.. తాజాగా మెగా సిటీని నిర్మించడానికి ప్లాన్ చేస్తోంది. 4 కీలక నగరాలతో మెగా సిటీని అభివృద్ధి చేయనుంది. "విజయవాడ, మంగళగిరి, అమరావతి, గుంటూరు" నగరాలను విలీనం చేయాలని యోచిస్తోంది. ఇదే జరిగితే.. ఈ నగరాల చుట్టూ ఉన్న భూముల ధరలు విపరీతంగా పెరగనున్నాయి.ఆర్థిక అవృద్ధికి రియల్ ఎస్టేట్ కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటునందించేందుకు.. రియల్ ఎస్టేట్ రంగంలో సడలింపులు ఇచ్చే యోచనలో ఉంది. ముఖ్యంగా లేఅవుట్ అనుమతుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. ఈ 4 నగరాలను విలీనం చేస్తే.. ఇప్పటికే ఉన్న మౌలిక వసతులను వినియోగించుకోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.గుంటూరు, విజయవాడ మధ్య ఇప్పటికే భూముల ధరలు భారీగా పెరిగాయి. ఈ నగరాలతో అమరావతి, మంగళగిరికి అనుసంధానం చేస్తే.. రియల్ఎస్టేట్ రంగం మరింత పుంజుకుంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. మెగా సిటీకి అడుగులు పడితే.. ఇప్పుడు మంజూరు అయిన ప్రాజెక్టులతో మెట్రో నగరంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఇక్కడ ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నాయి. దీంతో పరిశ్రమలకు సులువుగా కేటాయించే అవకాశం ఉంది.ఇప్పటికే అమరావతి అవుటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతున్నాయి. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్హెచ్ఏఐ) అధికారులు.. ఫైనల్ ఎలైన్మెంట్, డీపీఆర్, భూసేకరణపై ఫోకస్ పెట్టారు. ఇదే సంవత్సరంలో ఈ ప్రాజెక్టును ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నారు. 2018 లోనే ఈ ప్రాజెక్టు కోసం అడుగులు పడినా.. 2019లో ప్రభుత్వం మారడంతో ఆగిపోయింది.2024లో చంద్రబాబు సీఎం అయ్యాక.. మళ్లీ ఈ ప్రాజెక్టుకు ఊపిరి పోశారు. కేంద్రం నుంచి అవుటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు ఆమోదం లభించేలా చేశారు. దీంతో ఎన్హెచ్ఏఐ అధికారులు రంగంలోకి దిగారు. భూసేకరణ కోసం అధికారులను నామినేట్ చేయాలని కోరుతూ.. ఇటీవల ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్లకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు లేఖలు రాశారు. మెగా సిటీకి అడుగులు పడితే.. ఈ రింగ్ రోడ్డు చుట్టూ రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం భావిస్తోంది.అమరావతి ప్రాంతంలోని 22 మండలాలు, 87 గ్రామాల మీదుగా ఓఆర్ఆర్ నిర్మాణం కానుందని తెలుస్తోంది. దీంతో ఆయా గ్రామాల్లో భూములకు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భూముల ధరలకు రెక్కలు రానున్నాయి. విజయవాడ చుట్టుపక్కల ఉన్న మైలవరం, గన్నవరం, నూజివీడు, గుడివాడ, మంగళగిరి, తాడికొండ, పొన్నూరు, పెడన, మచిలీపట్నం, దెందూలూరు నియోజకవర్గాల్లోని భూముల ధరలు పెరిగే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

# తిరగదోడుతున్న స్కిల్ డెవలప్ మెంట్ కేసు

విజయవాడ, నవంబర్ 20, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ లో స్కిల్ డెవలప్మెంట్ కేసు అంటే దేశవ్యాప్తంగా అందరికీ తెలుసు. చంద్రబాబుకు కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా రాత్రికి రాత్రే అరెస్టు చేసిన కేసు అది. ఆ తర్వాత ఓ ముఖ్యమంత్రిని అరెస్టు చేయడానికి గవర్నర్ పర్మిషన్ తీసుకోవాల్సి ఉన్నా తీసుకోలేదన్న విషయం బయటపడింది. ఇప్పుడు ఆ స్కిల్ కేసు మొత్తం ఫేక్ అని.. నాటి ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ డీజీపీకి లేఖ రాశారు. తన వాంగ్మూలం ఆధారంగానే అరెస్టు చేసినట్లుగా కోర్టుకు చెప్పారు.కానీ తన వాంగ్మూలం అంతా ఫేక్ అని... దీనిపై విచారణ చేయాలని ఆయన లేఖ రాశారు. మరో వైపు పీవీ రమేష్ రాసిన లేఖ విషయాన్ని ఎమ్మెల్యే కోటంరెడ్డి అసెంబ్లీలో చర్చించారు. స్కిల్ కేసులో ఉన్న మొత్తం కుట్రను బయటకుతీయాలని ఆయన డిమాండ్ చేశారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబును అరెస్టు చేయడానికి ప్రధాన కారణంగా చంద్రబాబు హయాంలో ఐఏఎస్గా పని చేసిన పీవీ రమేష్ వాంగ్మూలం కీలకం. డబ్బులు రిలీజ్ చేయాలని చంద్రబాబు ఒత్తిడి చేశారని నిబంధనలను అతిక్రమించమని ఆయన చెప్పారని పీవీ రమేష్ చెప్పినట్లుగా సీఐడీ అధికారులు కోర్టుకు తెలిపారు. అయితే పీవీ రమేష్ తాను అలాంటి వాంగ్మూలం ఇవ్వలేదని..అంతా స్వయంగా జరిగిందని చెప్పానని తాజాగా డీజీపీకి లేఖ రాశారు. ఆ కేసులో సీఐడీ అధికారులకు తానిచ్చిన స్టేట్ మెంట్ కాపీ తన వద్ద ఉందన్నారు. ఈ కేసు విషయంలో ఏం జరిగిందో సమగ్ర విచారణ చేయాలని పీవీ రమేష్ లేఖలో కోరారు. స్కిల్ కేసులో అసలు ఏం జరిగిందో చెప్పడం కన్నా.. తప్పుడు ప్రచారం చేయడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. స్కిల్ సెంటర్లు రాష్ట్రవ్యాప్తంగా పెట్టారు. కానీ ఈ అంశంపై ఆడిటింగ్ చేసిన సంస్థ సీమన్స్ కంపెనీ అన్నీ ఒప్పందం ప్రకారం సరఫరా చేసిందని.. కొన్ని వేల మంది విద్యార్థులు ట్రైనింగ్ తీసుకున్నారని చెప్పలేదు. అది ఆడిట్ చేయాల్సిన అవసరం లేదని ప్రభుత్వ చెప్పినట్లుగా తెలుస్తోంది. దీంతో ఆడిటింగ్ చేసిన సంస్థ కుట్ర చేసిందని డిజైన్ టెక్ సంస్థ ఐసీఏఐలో ఫిర్యాదులో చేసింది.అలాగే ఇందులో ఒక్క రూపాయి కూడా చంద్రబాబుకు లేదా టీడీపీకి చేరాని కోర్టుకు చెప్పలేకపోయారు. టీడీపీ సభ్యత్వ రుసుము లెక్కలు కూడా చూశారు.చివరికి ఎలక్టోరల్ బాండ్ల లెక్కలుకూడా బయటకు వచ్చాయి. ఈ స్కిల్ కేసులో ఉన్న కంపెనీలేవీ టీడీపీకి విరాళాలివ్వలేదు. మాజీ ముఖ్యమంత్రి స్కాం చేస్తే కనీసం నోటీసులు ఇచ్చి విచారణ చేసి..ఆధారాలు ఉంటే అరెస్టు చేస్తారు.కానీ కనీసం ఎఫ్ఐఆర్లో పేరు కూడా లేకుండా ఆయనను అరెస్టు చేసిన తర్వాత ఆ పని చేసి కోర్టులో ప్రవేశ పెట్టారు. ఇలా ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించాల్సిన వ్యవస్థలు కూడా అచేతనమయ్యాయి. ఈ కారణంగా యాభై రోజులకుపైగా చంద్రబాబు జైల్లో ఉండాల్సి వచ్చింది.ఇప్పుడీ కేసులో ఎవరి చెబుతోందో..ఆయన వాంగ్మూలం ట్యాంపర్ చేశారని ఆరోపిస్తున్నారు. ఇప్పుడు అసెంబ్లీలోనూ సమగ్ర విచారణకు డిమాండ్ చేస్తున్నారు. _ విచారణ జరిపితే.. చాలా మంది ఐపీఎస్లు.. నాటి రాజకీయ నేతలతో చేసిన కుట్రలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని టీడీపీ నేతలు అంటున్నారు.

# విశాఖలో దారుణం,,,

విశాఖపట్టణం, నపంబర్ 20, ఏపీలో ఆడపిల్లల ఘోరాలు ఆగడంలేదు. నిత్యం ఏదోకచోట మృగాళ్లు ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడుతూనే ఉన్నారు. తాజాగా విశాఖలో మరో దారుణం వెలుగుచూసింది. లా విద్యార్థినిపై నలుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అత్యాచారం చేసి ఆ వీడియోలను తమ సెల్ఫోన్లలో రికార్డు చేశారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో పెడతామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఆ వీడియోలు అడ్డం పెట్టుకుని పలుమార్లు లా విద్యార్థినిపై అత్యాచారానికి ఒడిగట్టారు. విద్యార్థిని పోలీసులను ఆశ్రయించడంతో ఈ దారుణం వెలుగు చూసింది.బాధితురాలి విశాఖ మధురవాడలోని ఓ లా కాలేజీలో లా మూడో సంవత్సరం చేస్తుంది. విద్యార్థిని తన సహచర విద్యార్థి వంశీతో స్నేహం చేసింది. ఆ స్నేహం ప్రేమగా మారింది. విద్యార్థినిని పెళ్లి చేసుకుంటానని నమ్మించిన వంశీ, ఈ ఏడాది ఆగస్టు 10న కంబాలకొండకు తీసుకెళ్లాడు. అక్కడ విద్యార్థినిపై వంశీ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. విద్యార్థినిని ఆగస్టు 13న డాబాగార్డెన్ లోని తన స్నేహితుడు ఆనంద్ ఇంటికి తీసుకెళ్లిన వంశీ..మరోమారు అత్యాచారం చేశాడు. అనంతరం వంశీ స్నేహితులు ఆనంద్, రాజేష్, జగదీష్ కూడా యువతిపై సామూహిక అత్యాచారం చేశారు. యువతి నగ్నంగా ఉన్న వీడియోలు తీసి బెదిరిస్తూ పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డారు.ఆ తర్వాత వంశీ స్నేహితులు ఆనంద్, రాజేష్, జగదీష్ యువతికి ఫోన్ చేసి తమ కోరిక తీర్చాలని లేకపోతే వీడియోలు బయటపెడతామని బెదిరించారు. ఈ విషయాన్ని యువతి వంశీ దృష్టికి తీసుకెళ్లగా...తన స్నేహితుల కోరిక తీర్చాలని ఆమె వేధించాడు. నలుగురి నుంచి రోజురోజుకీ వేధింపులు పెరగడంతో ఈ నెల 18న ఉరివేసుకుని ఆత్మాహత్యాయత్నం చేసింది బాధితురాలు. యువతిని గమనించిన ఆమె తండ్రి కాపాడి అసలేం జరిగిందని నిలదీయడంతో నిర్ఘాంతపోయే విషయాలు యువతి తండ్రికి చెప్పింది. దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. కానీ.. కూతురి ఆత్మహత్యాప్రయత్నాన్ని అడ్డుకున్న తండ్రి.. ఆమె వేదన వెనకున్న కారణాలపై ఆరా తీశాడు. దాంతో.. జరిగిందంతా చెప్పి కన్నీరుమున్నీరుగా విలపించింది బాధితురాలు.అయితే.. ఇలాంటి పరిస్థితులు.. ఇలాంటి అన్యాయం మరొకరికి జరగకూడదనే ఆలోచనతో విశాఖ పోలీసులను ఆశ్రయించారు బాధితురాలి కుటుంబసభ్యులు. కేసు నమోదు చేసిన పోలీసులు.. నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితుల్లో ముగ్గురు యువతి క్లాస్మేట్స్ ఉన్నారు.. అయితే.. పోలీసుల విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. యువతితో నేరస్థులు నలుగురు దారుణంగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది.. బాధిత యువతి న్యాయ విద్యను అభ్యసిస్తోంది..ఇక.. ఈ దారుణ ఘటనపై ఏపీ హోంమంత్రి అనిత సీరియస్ అయ్యారు. విశాఖ సీపీ శంకబ్రత బాగ్చీతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు హోంమంత్రి అనిత..కాగా.. ఈ ఘటన ఏపీలో సంచలనంగా మారింది.. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజలు కోరుతున్నారు.దీంతో బాధితురాలి తండ్రి విశాఖ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు.విశాఖ లా విద్యార్థిని సామూహిత అత్యాచార ఘటన సంచలనం అవుతోంది. ఈ ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. విశాఖ సీపీతో హోంమంత్రి అనిత ఫోన్లో మాట్లాడి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సామూహిక అత్యాచారానికి పాల్పడ్డ యువకులను కఠినంగా శిక్షించాలని ఆదేశించారు. విశాఖలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం ఉండగా ఉంటుందని హోంమంత్రి అనిత తెలిపారు.

# దేశ రాజధాని మార్చాలంటూ కొత్త డిమాండ్

తిరువనంతపురం, నవంబర్ 20,దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం తారాస్థాయికి చేరుతోంది. ఇక్కడ విపరీతంగా కాలుష్యం నమోదవుతోంది. చుట్టుపక్కల పరిశ్రమలు.. హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన రైతులు తమ పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల విపరీతంగా కాలుష్యం నమోదవుతున్నది. దీనికి చలి కూడా తోడు కావడంతో ఢిల్లీలో గాలి నాణ్యత మరింత క్షీణించింది. దీంతో అక్కడి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.. వృద్ధులు, చిన్నారులు శ్వాస కోశ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యుడు శశి థరూర్ వినూత్న డిమాండ్ తెరపైకి తీసుకువచ్చారు. " ఢిల్లీలో కాలుష్యం విపరీతంగా పెరుగుతుంది. గాలి పీల్చడానికి అనువుగా లేకుండా పోతుంది. చాలామంది శ్వాస కోశ సంబంధిత వ్యాధుల బారిన పడి ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశ రాజధానిగా ఢిల్లీ నగరాన్ని కొనసాగించాలా?" అంటూ ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.ఢిల్లీలో వాయు కాలుష్యం పెరుగుతోంది. ఈ ఏడాది మరింత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. గాలి నాణ్యత సూచి ఏకంగా 500 మార్క్ ను చేరుకుంది.. ఈ వాయు కాలుష్యానికి దట్టమైన పొగ మంచు తోడైంది. దీంతో గాలి నాణ్యత అధ్వానంగా మారింది. వాయు కాలుష్యం వల్ల ప్రజలు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో శశిథరూర్ కేంద్రంపై తీవ్రస్థాయిల విమర్శలు చేశారు.. ఇలాంటి పరిస్థితుల్లో ఢిల్లీ నగరాన్ని దేశ రాజధానిగా ఎందుకు కొనసాగించాలని ఆయన ప్రశ్నించారు. " ఢిల్లీ ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది. ఇక్కడ అత్యంత ప్రమాదకర కాలుష్య కారకాలు నాలుగు రెట్లు పెరిగాయి. ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరాల్లో బంగ్లాదేశ్ రాజధాని ఢాకా రెండో స్థానంలో ఉంది. ఆ నగరంతో పోల్చి చూస్తే ఢిల్లీలో ఐదురెట్ల స్థాయిలో ప్రమాదకర కాలుష్యం ఉంది. కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. కేంద్రం పట్టించుకోవడం లేదు. ఇది అత్యంత విడ్డూరంగా ఉంది. నవంబర్ నుంచి జనవరి వరకు ఢిల్లీ నగరంలో నివాసం ఉండడానికి అవకాశం లేకుండా పోతోంది. ఇక మిగతా రోజుల్లోనూ ఇక్కడ జీవన సాగించడం అంతంత మాత్రం గానే ఉంది. ఇలాంటి పరిస్థితుల మధ్య ఢిల్లీని దేశ రాజధానిగా ఎందుకు కొనసాగించాలి" అని శశి థరూర్ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు.ఢిల్లీలో కాలుష్యం పెరిగిన నేపథ్యంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 500 మార్క్ కు చేరుకుంది. మంగళవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 494 కు చేరుకుందని అధికారులు చెబుతున్నారు. నవంబర్ నెలలో ఇదే అత్యధికమని వారు వివరిస్తున్నారు.

# దోస్త్... మేరా దోస్త్...

## కూటమిలో పార్టీల ఐక్యతా రాగం

కాకినాడ, నవంబర్ 20, కలిసుంటే కలదు సుఖం. కూటమిగా ఉంటేనే బలం. ఉమ్మడిగా వెళ్తేనే విజయం అంటున్నారు సీఎం చంద్రబాబు. జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ కూడా ఇవే డైలాగ్స్ రిపీట్ చేస్తున్నారు. అటు కమలం లీడర్లు దోస్త్ మేరా దోస్త్ అంటున్నారు. 2014లో ఆ ముగ్గురి దోస్తీ స్టార్ట్ అయింది. 2019లో బ్రేక్ పడినా..2024కు వచ్చేసరికి పొలిటికల్ పిక్చర్ బద్దలు అయిపోయింది. అలాంటప్పుడు ఎవరిదారి వాళ్లు ఎందుకు చూసుకోవాలి. కలసి నడిస్తేనే కదా..అసలైన కిక్కు అంటున్నారు ఏపీ సీఎం చంద్రబాబు.టీడీపీ, జనసేన, బీజేపీ ఫ్యూచర్ పొలిటిక్స్పై ఫుల్ క్లారిటీతో ఉన్నారు. అంతకముందు బీజేపీతో చంద్రబాబు పొత్తులు పెట్టుకున్నప్పటికీ..2014లో ఫస్ట్ టైమ్ ఈ మూడు పార్టీలు కలసి పోటీ చేశాయి. ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చారు. 2019లో విడిగా పోటీ చేసి ఓటమిని చవి చూశారు. 2024కు వచ్చేసరికి ఉమ్మడిగా బరిలోకి దిగి..నెవర్ బిఫోర్ పొలిటికల్ హిస్టరీ క్రియేట్ చేశారు. దాంతో ఇక వీడేది లేదు. ఒకరిని ఒకరు విడిచిపెట్టేది లేదు. ముగ్గురం ఒకటే. అందరి ఎజెండా అభివృద్ధే అంటూ నవ్యాంధ్ర ఫ్యూచర్ పొలిటిక్స్పైనా బాబు ఓ క్లారిటీకి వచ్చేశారు.కూటమి ఫ్యూచర్పై హస్తిన వేదికగా సీఎం చంద్రబాబు చేసిన కామెంట్స్ ఇప్పుడు చర్చనీయాంశంగా అవుతున్నాయి. జమిలి ఎన్నికలు వచ్చినా..2029లో ఎలక్షన్స్ జరిగినా కలసే పోటీ చేస్తాం..ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమవుతున్నామంటూ బాబు చెప్పడం హాట్ టాపిక్ అవుతోంది. కూటమిలో ఎలాంటి సమస్యలు లేవని, కలిసి కట్టుగా ముందుకు సాగుతున్నామని..చంద్రబాబు స్పష్టం చేశారు. నరేంద్ర మోదీనే తమ నాయకుడని, ఆయన నేతృత్వంలోనే ముందుకు వెళ్తామని కూడా చెప్పారు.ఇక్కడే బాబు మార్క్ రాజకీయం, థర్టీ ఇయర్స్ పొలిటికల్ ఎక్స్పీరియన్స్ క్లియర్ కట్గా కనిపిస్తుంది. మొన్నటి ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలసి పోటీ చేసినా..టీడీపీకి అధికారానికి కావాల్సినన్నీ సీట్లు వచ్చాయి. 135 ఎమ్మెల్యేలు..16 ఎంపీలు గెలుచుకుంది టీడీపీ. అయినప్పటికీ అటు కేంద్రంలో ఉన్న బీజేపీతోనూ..రాష్ట్రంలో జనసేనతో సఖ్యతతోనే ఉంటున్నారు బాబు. అధికారంలోకి వచ్చాం..అవసరమైపోయిందని కాకుండా..కలసి నడిస్తే పార్టీలకు, ప్రజలకు జరిగే మేలేంటి తెలిసిన నాయకుడిగా బిహేవ్ చేస్తున్నారు.ఏపీలో టీడీపీ ఓటు బ్యాంకుకు ఎప్పుడూ ఢోకా లేదు. అయితే ప్రభుత్వంలో ఏ పార్టీపై అయినా అంతో ఇంతో ప్రజావ్యతిరేకత కామన్. డిసైడింగ్ ఫ్యాక్టర్గా ఉండే ఆ ఓటు షేర్ మీదే పార్టీల గెలుపోటములు డిపెండ్ అయి ఉంటాయ్. అందుకే ఇప్పుడు బంపర్ మెజార్టీ, ఫుల్ లోడ్ స్రెంథ్తో ఉన్నా..లాంగ్ లివ్ కూటమి అంటున్నారు బాబు. రాష్ట్రంలో జనసేన, బీజేపీ కంటే టీడీపీ ఓటు బ్యాంకే ఎక్కువ. ఆ పార్టీనే బూత్ స్థాయి వరకు చాలా స్ట్రాంగ్గా ఉంది.అంత పటిష్ఠంగా ఉన్న పార్టీని లీడ్ చేస్తున్న అధినేతే కూటమి కంటిన్యూ అవుతుందని చెప్పడం దూరదృష్టికి ఎగ్జాంపుల్గా చెప్తున్నారు పొలిటికల్ ఎనలిస్టులు. ఒక్క రోజు కోసం కాదు..ఈ టర్మ్ కోసం అసలే కాదు..భవిష్యత్ ప్రణాళికతో బాబు ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోందంటున్నారు. బాబు టీడీపీకి సారథ్యం వహించినప్పటి నుంచి బీజేపీతోనే ఎక్కువసార్లు కలసి పోటీ చేశారు. 2014 నుంచి జనసేనతో దోస్తీ మొదలు పెట్టారు. క్యాస్ట్ ఈక్వేషన్లు, పార్టీ సిద్ధాంతాల పరంగా చూస్తే బీజేపీ, జనసేనకు ఏపీలో చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకే ఉంది. అది తోడైతే విజయం ఈజీ అవుతుంది. ఇదే బాబు లాజిక్ అని పొలిటికల్ ఎనలిస్టులు చెప్తున్నారు.రాజకీయాలు అన్నప్పుడు పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. మొన్నటి ఎన్నికల్లో లభించినంత ప్రజా మద్దతు ఎప్పటికీ ఉండకపోవచ్చు. అలాంటప్పుడు కూటమిగా పోటీ చేస్తే..గత ఎన్నికల్లో వచ్చినంత ల్యాండ్ స్లైడ్ విక్టరీ కాకపోయిన..ప్రభుత్వ ఏర్పాటుకు మాత్రం ఇబ్బంది ఉండదనేది బాబు ప్లాన్ తెలుస్తోంది. సేమ్టైమ్ కలిసి కట్టుగా గెలిచారు..కూటమిగా ఎన్నాళ్లుంటారు.? మిత్రబంధం ఎప్పటిదాకా.? అన్న ప్రశ్నలకు కూడా టీడీపీ అధినేత కామెంట్స్తో క్లారిటీ వచ్చేసింది.క్షేత్రస్థాయిలో తెలుగు తమ్ముళ్లు-బీజేపీ, జనసేనతో కలసి నడవాల్సిందేనని ఇండికేషన్ ఇచ్చారు. కూటమి నేతల మధ్య అక్కడక్కడ చిన్న చిన్న గ్యాప్లు ఉన్నాయంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో ఎండ్కార్డ్ వేసేలా పొత్తు పాలిటిక్స్పై బాబు స్పష్టత ఇచ్చినట్లు అయింది. గ్రౌండ్ లెవల్లో నాయకులు, కార్యకర్తలు..కలిసి మెలిసి ఉండాల్సిన అవసరం ఉందనే సంకేతాన్ని కూడా పంపించారు. ఇలా కూటమి పార్టీలకు..మరీ ముఖ్యంగా టీడీపీ క్యాడర్కు..అపోజిషన్ వైసీపీకి..ఫ్యూచర్ పొలిటికల్ సినారియో ఎలా ఉంటుందో..చెప్పకనే చెప్పారు సీఎం చంద్రబాబు

# చెల్లి ఫోటో... అక్కచీటింగ్...

కర్నూలు, నవంబర్ 20, చెల్లెలు ఫోటోతో ఓ అబ్బాయికి పరిచయమైంది ఆ యువతి. అది కూడా సోషల్ మీడియా ద్వారా మాటలు కలిపి, ఏకంగా ఒక కోటి 20 లక్షలు మోసం చేసిందట. చివరకు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, వైద్యశాలలో చికిత్స పొందుతోంది ఆ యువతి. ఈ ఘటన కర్నూలు జిల్లా పత్తికొండలో జరగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.కర్నూలు జిల్లా పత్తికొండ మండలం చక్రాల గ్రామానికి చెందిన ఓ యువతి, తెలంగాణ పటాన్ చెరువు మండలం ముత్తంగి కి చెందిన యువకుడికి ఫేస్ బుక్ ద్వారా పరిచయమైంది. యువకుడు హైదరాబాద్ లోని ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, వీరి పరిచయం ఏళ్ల తరబడి కొనసాగింది.అయితే సదరు యువతిని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్న యువకుడు, పెళ్లి మాట ఎత్తగానే యువతి ఏదో ఒక కారణం చెబుతూ దాటవేసేదట. పలుమార్లు ఆర్థికంగా సహాయపడేందుకు డబ్బులు అందజేసిన యువకుడు, మొత్తం కోటి 20 లక్షలు అందజేసినట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.చివరకు తాను మోసపోయానని గ్రహించిన యువకుడు పెద్దల సమక్షంలో పంచాయతీ చేయగా, రూ.10 లక్షలు వెనక్కి ఇచ్చినట్లు సమాచారం. ఇక మిగిలిన డబ్బులను యువకుడు పదేపదే అడుగుతుండగా, డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించిన నేపథ్యంలో పత్తికొండ పోలీసులను యువకుడు ఆశ్రయించాడు.చెల్లెలు ఫోటో సోషల్ మీడియా ముఖచిత్రంగా ఏర్పాటు చేసుకొని తనను సదరు యువతి మోసగించిందని, ఆర్థికంగా డబ్బు సహాయం అడిగిన సమయంలో తాను కోటి 20 లక్షల వరకు అందించినట్లు తెలిపాడు. అయితే పదేపదే డబ్బులు అడిగిన సందర్భంలో యువతి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి ఏకంగా మత్తు గులిగలు మింగి అన్నంత పని చేసింది. దీనితో కుటుంబ సభ్యులు అప్రమత్తమై వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.ఓ వైపు తనకు న్యాయం చేయాలని యువకుడు, మరోవైపు ప్రాణాప్రాయ స్థితిలో ఆ యువతి ఉండగా, పెద్దలు మరోమారు ఈ విషయంలో జోక్యం చేసుకోనున్నట్లు తెలుస్తోంది

# యువకుడిపై దాడి

రాజోలు,కోనసీమ జిల్లా మల్కిపురం లో దారుణం జరిగింది. పచ్చని కోనసీమ లో రౌడీయిజం చాప కింద నీరులా వేళ్ళునుకుంటుంది. యువరాజు అనే యువకుడు పై నలుగురు యువకులు పైశాచికదాడి కి దిగారు. దాడి చేసిన దృశ్యాలు ఆ యువకులు మొబైల్లో రికార్డ్ చేసారు. దాడికి గురైన యువకుడు రాజోలు నియోజకవర్గం మల్కిపురం ఏఎఫ్డీటీ జూనియర్ కళాశాల విద్యార్థి రామేశ్వరపు జయసాయి యువరాజుగా గుర్తించారు. కుమారుడిని తండ్రి రామేశ్వరపు శంకర్ హాస్పటల్ కి తరలించారు.

# శబరిమలైలో భక్తుల రద్దీ

తిరువనంతపురం,సోమవారం రాత్రి నుండి శబరిమలకు అయ్యప్ప భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. వేలాది మంది భక్తులు రావడంతో శబరిగిరులు అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగిపోతున్నాయి.ఇక అయ్యప్ప స్వామి దర్శనానికి దాదాపు 10 గంటల సమయం పడుతుంది.సన్నిధానం నుంచి పంబ వరకూ అయ్యప్ప భక్తులు క్యూ లైన్ లో వేచి ఉన్నారు. మండల పూజలు ప్రారంభం కావడంతో శబరిమలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుండటంతో అందుకు తగినట్లుగా ఏర్పాట్లను ఆలయ కమిటీ ట్రావెన్ కోర్ చేస్తుంది.కాగా, ఇప్పటికే శబరి మలకు వచ్చే అయ్యప్ప భక్తుల దర్శనం కోసం ట్రావెన్ కోర్ దేవస్థానం కమిటీ పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. ముందుగానే ఆన్ లైన్ లో టిక్కెట్లను బుక్ చేసుకో వడం ద్వారా దర్శనం కల్పిస్తుంది.

# స్కూలు బస్సు బోల్తా..క్లీనర్ మృతి

తణుకు,తణుకు హైవే డీమార్ట్ వద్ద కేకేఆర్ స్కూలు బస్సు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో స్టెప్పింగ్ స్టోన్స్ స్కూలుకు చెందిన క్లీనర్ మేళం ప్రవీణ్ దుర్మరణం పాలయ్యాడు. తణుకు నుంచి ముక్కామల విద్యార్థులను ఎక్కించుకునేం దుకు వెళుతున్న స్కూల్ బస్సులో లిఫ్ట్ అడిగిన ప్రవీణ్ మృతి చెందాడు. బోల్తా కొట్టిన బస్సులో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. విద్యార్థులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



## పట్టణ సీఐ శ్రీనివాసులు ను మర్యాదపూర్వకంగా కలిసిన అసెంబ్లీ కో కన్వీనర్ తొగట నరసింహులు..





విభారే న్యూస్ నవంబర్ 20 ఎమ్మిగనూరు.బుధవారం ఉదయం 11:00 గంటలకు పట్టణ సీఐ శ్రీనివాసులు ని ఎమ్మినూర్ అసెంబ్లీ కో - కన్వీనర్ తోగట నరసింహులు గౌరవపూర్వకంగా వారిని కలసి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు జటప్ప, మల్లికార్జున ఆచారి,చేనేత శివ, బండారవి,వడ్డే బజారి, పద్మావతి, బోయకాసిం తదితర కార్యకర్తలు పాల్గొన్నారు


## సిఐడి డిఎస్పి దైవప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు..




విభారే న్యూస్ నవంబర్ 20 కర్నూలు జిల్లా ప్రతినిధి..రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ సిఐడి అడిషనల్ డిజిపి డా. రవిశంకర్ అయ్యనార్, ఐపీఎస్ నేత్రత్వంలోబుధవారం ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు నంద్యాల జిల్లా, గడివేముల లో ఏపీ ఆదర్శ పాఠశాల, జూనియర్ కాలేజీ నందు,కర్నూల్ సిఐడి రీజినల్ ఆఫీస్ ఆర్. ఓ, డి.ఎస్.పి,టి. దైవ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సి, ఎస్టి చట్టాల పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సు కు కర్నూలు ఆర్.ఓ. సిఐడి, డిఎస్పి వాహిద్ బాష,నంద్యాల డి.ఎస్.పి శ్రీనివాస రెడ్డి, శ్రీమతి చింతామణి, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, సిఐడి ఇన్స్పెక్టర్స్ ఎన్. ఎస్.ఎం.శ్రీధర్,ఎన్. గిరిబాబు సిఐడి స్టాఫ్ తో పాటు, పాణ్యం సర్కిల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, గడివేముల ఎస్సై సి.సి.నాగార్జున రెడ్డి, వాసుదేవ గుప్త, ఎంపీడీవో గడివేముల,ఎస్.వెంకటరమణ, తహసిల్దార్, గడివేముల, శ్రీమతి శైలజ, ప్రిన్సిపాల్, జూనియర్ కాలేజీ, గడివేముల, కొమ్ముపాలెం శ్రీనివాస్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి మెంబెర్ హాజరై ఎస్సి/ ఎస్టి చట్టాల పై ప్రసంగించి, విద్యార్థులకు,ప్రజలకు ఎస్సి/ఎస్ టి చట్టాల పై అవగాహన కలిగించినారు. అతిధులకు సి ఐ డి అధికారులు జ్ఞాపికలు అందజేసినారు. ఎస్ సి/ఎస్ టి చట్టాలకు సంబంధించిన అవగాహన లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ముగ్గురికి సి ఐ డి అధికారులు బహుమతులు అందజేసినారు.

## గురువారం సందర్భంగా నేడు దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు..

విభారే న్యూస్ నవంబర్ 20 కర్నూలు జిల్లా ప్రతినిధి..శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో కార్తీకమాస సందర్భంగా దత్తాత్రేయునికి 21-11- 2024 గురువారం విశేషంగా పూజలు జరుగుతున్నాయి గోపూజ -516దత్త ఫలం -100దత్త తైలాభిషేకం-200అనఘాష్టమి వ్రతం ప్రధానంగా-1116దత్త హోమం ప్రధా నంగా-3500 కావున భక్తులు శివ కేశవుల కాగలరు. సంప్రదించ వలసిన నెంబర్: -సురేష్ శర్మ - 6361047 578దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8 896123777



# పాఠశాల సమయం పెంచడం వల్ల అనర్థాలు జరిగే అవకాశం ఉంది: ఆప్టా..



విభారే న్యూస్ నవంబర్ 20 కర్నూలు జిల్లా ప్రతినిధి..జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల సమయాన్ని పైలట్ ప్రాజెక్టు పేరు మీద సాయంత్రం ఐదు వరకు పెంచడం సమంజసం కాదని ఇలా ఏ రాష్ట్రంలో లేదని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ జి ఎస్ గణపతి రావు కే ప్రకాష్ రావు పత్రికా ప్రకటనలో తెలియచేశారు, దీనివల్ల విద్యార్థులకు లాభం కన్నా నష్టాలు ఎక్కువ జరిగా అవకాశం ఉందని వారు తెలియజేశారు ప్రస్తుతం శీతాకాలం అయినందున సాయంత్రం ఐదు ఇరవై నిమిషాలకే సూర్యాస్తమయం అవుచున్నందున పాఠశాల విడిచిన తర్వాత చీకటిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులు తమ తమ గ్రామాలను చేరుకునేటప్పుడు రహదారి మధ్యలో అనేక ఇబ్బందులు కొన్ని అవాంఛిత సంఘటనలు జరిగే అవకాశం ఉందని వారు తెలియజేశారు ప్రస్తుతం 9 ,10 తరగతిలో చదువుతున్న విద్యార్థులు యుక్తవయసులో ఉన్నందున మార్గమధ్యంలో వారికి కొన్ని అసాంఘిక దుశ్చర్యలు జరిగే అవకాశం ఉందని వారు వాపోయారు ,ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు ఉపాధ్యాయులు బోధనకే ఇబ్బంది కాకుండా విద్యార్థులు నేర్చుకున్నది వంట పట్టించుకోవడం కూడా ఇబ్బంది అవుతుందని కావున ప్రభుత్వం పాఠశాల లను ప్రయోగశాలలుగా మార్చవద్దని వారు రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని లేక ద్వారా కోరుచున్నారు ,కొత్త ప్రభుత్వం ఏర్పడి ఈరోజు కి 6 నెలలు పూర్తయినప్పటికీ గౌరవ విద్యాశాఖ మంత్రివర్యులు ఉపాధ్యాయ సంఘాలతో ఒక్క సమావేశం కూడా ప్రత్యక్షంగా ఏర్పాటు చేయలేదని వారు వాపోయారు గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులు ఎన్నో ఒడిదుడుకులకు అవమానలకు ఆందోళనకు గురయ్యారని ఈ ప్రభుత్వమైనా తమను గుర్తించి విద్యావ్యవస్థను బాగు చేస్తాదని ఆశపడ్డామని కానీ ప్రభుత్వ చర్యలు తమ ఆశ నిరాశన్నట్టుగా ఉన్నాయని ఆప్టా నాయకులు పత్రికా ముఖంగా తెలియజేశారు.

# కలెక్టర్ కార్యాలయం దగ్గర జరిగే ధర్నా కార్యక్రమానికి తరలి వెళ్లిన డోన్ విఓఏ లు..




విభారే న్యూస్ డోన్ మా ప్రతిని:-నవంబర్ 20 విఓఏ ల సమస్యల పరిష్కారం కొరకు ఏపీ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల దగ్గర జరిగే ధర్నా కార్యక్రమాలలో భాగంగా నంద్యాల కలెక్టరేట్ దగ్గర జరిగే ధర్నాలో పాల్గొనడానికి డోన్ నుండి వివోఏ లు బుధవారం నంద్యాలకు తరలి వెళ్లారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,డోన్ మండల వివోఏ ల సంఘం ప్రధాన కార్యదర్శి టి.లక్ష్మణ్,కోశాధికారి ఇ.గుండాలయ్య లు మాట్లాడుతూ వివోఏ లపై రాజకీయ వేధింపులు,అధికారుల వేధింపులు ఆపాలని,అక్రమ తొలగింపులు ఆపాలని,తొలగించిన వారిని వెంటనే విధులలోకి తీసుకోవాలని,మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని,ప్రస్తుత ధరలకు అనుగుణంగా 26 వేల రూపాయల వేతనాలు చెల్లించాలని తదితర రాష్ట్ర వ్యాప్త డిమాండ్ల సాధన కొరకు ఎన్నో సంవత్సరాలుగా వివిధ రూపాలలో ఉద్యమాలు చేస్తున్నట్లు వారు తెలిపారు.పై డిమాండ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరిస్తానని ఎన్నికల సందర్భంగా హామీ ఇవ్వడం జరిగిందని ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వారన్నారు.అదేవిధంగా స్థానికంగా వారం రోజుల క్రితం రాజకీయ వేధింపులకు,అధికారుల వేధింపులకు గురై డోన్ మండలం కొత్త బురుజు గ్రామానికి చెందిన వివోఏ వెంకటరామిరెడ్డి గుండెపోటుతో మరణించడం జరిగిందని నిబంధనలను అతిక్రమించి ఆయనను వేధింపులకు గురిచేసి ఆయన మరణానికి కారణమైన డోన్ వెలుగు ఏపిఎం మల్లికార్జున,సీసీ ఈశ్వరమ్మ లను వెంటనే సస్పెండ్ చేసి వెంకటరామిరెడ్డి కుటుంబానికి నష్టపరిహారం ప్రకటించి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తేబోతున్నట్లు వారు స్పష్టం చేశారు.నంద్యాలకు 50 మంది విఓఏ లు తరలి వెళ్తున్నట్లు వారు తెలిపారు.

# కనులపండువగా శ్రీశైల మల్లన్న స్వర్ణ రథోత్సవం



శ్రీశైలంనవంబర్ 20 : ప్రముఖ క్షేత్రమైన శ్రీశైలంలో మల్లికార్జునస్వామి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వర్ణ రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయంలో మంగళవారం ఉదయం అర్చక వేదపండితులు పంచామృతాభిషేకాలు, వివిధ రకాల ఫలోదకాలు, శుద్ధ జలాలతో స్వామివారిని అభిషేకించి మహాబిల్వార్చన, పుష్పార్చనలు చేశారు. లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ మహా సంకల్పాన్ని పఠించి శాంతి మంత్రాలు పఠించారు. అనంతరం స్వర్ణరథంపై ఆశీనులైన స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్త పూజలు చేసి, మంగళహారతులు సమర్పించారు. ఆలయ మహాద్వారం నుంచి నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ రథోత్సవం నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులుఅధిక సంఖ్యలోతరలివచ్చారు.స్వర్ణ రథోత్సవాన్ని ప్రతి మాసంలో ఆరుద్ర నక్షత్రం రోజున నిర్వహించనున్నట్లు తెలిపారు.




## నంద్యాల పొడి చెత్త జిందాల్ ఫ్యాక్టరీకి కమిషనర్ నిరంజన్ రెడ్డి



నంద్యాల పురపాలక సంఘం ( కంపోస్టు యార్డ్ ) నుంచి పొడిచెత్తను జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి అందచేయడం కొరకు ఫ్యాక్టరీ యాజమాన్యం వారితో సంప్రదించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి బుధవారం ఒ ప్రకటన లో తెలిపారు. ఆయన మాట్లాడుతూ కంపోస్టు యార్డు యందు ఉన్న పొడి చెత్తను జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ వారు తీసుకొను పోవుటకు అంగీకరించారని తెలిపారు. ఈ విషయాన్ని జిందాల్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఏ జీ ఎమ్ అన్వేష్ తో మరియు సీనియర్ మేనేజర్ గోపితో మాట్లాడడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఎమ్ ఈ గురప్పయాదవ్మున్సిపల్ డీఈ రసూల్.శానిటేషన్ సూపర్వైజర్ మురళీధర్. లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. ఉన్నారు.

## రహదారులు అక్రమార్కుల చేతుల్లోకి కాపాడాలని స్థానిక ప్రజలు



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 20- పట్టణంలో రహదారులు అక్రమార్కుల చేతుల్లోకి పోతున్నాయని వాటిని కాపాడివారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆక్రమణకు కాదేది అనర్హం అంటూ ఏకంగా ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా ఉన్న రహదారిని అక్రమార్కులు తమ స్థలంగా చెబుతూ అక్రమణకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. నంద్యాల జిల్లాగా ఏర్పాటు అయిన తర్వాత నంద్యాల పట్టణంలో ఎక్కడైనా ఏ స్థలమైనా ఒక సెంటు భూమి లక్షల నుండి కోట్లకు విలువచేస్తున్న పరిస్థితి ఉన్నది. అయితే నంద్యాల పట్టణం సాయిబాబనగర్ ప్రాంతంలోని యేసుకృప చర్చి సమీపంలోని ప్రజల ఉపయోగకరంగా ఉన్న 30 అడుగుల రహదారి రోడ్డును అధికార పార్టీకి చెందిన అక్రమార్కులు ప్రయత్నాలు చేస్తున్నారు. మున్సిపాలిటీ వారు మెటల్ రోడ్డు వేసి ప్రజల రాకపోకలు సాగించేందుకు చర్యలు చేపట్టారు. విద్యుత్శాఖ వారు ఆ రోడ్డుకు ఇరువైపుల విద్యుత్ దీపాలను వేశారు. అయితే అక్రమార్కులు ఆరోడ్డు స్థలం తమదని రిజిస్టర్ పత్రాలు తమ పేరునే ఉన్నాయని చెబుతూ సదరు రోడ్డు స్థలాన్ని కబ్జా చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఈ రోడ్డు అక్రమార్కుల చేతిలోకి వెళ్లకుండా ప్రజాప్రయోజనాలకు ఉపయోగించేందుకు రోడ్డును చూడాలని, మెటల్ రోడ్డు పై సీసీ రోడ్డు వేయాలని స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. అక్రమార్కులపై తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## వరి పంట పరిశీలన



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 20- నంద్యాల మండలం చాప రేవుల గ్రామం నందు బుధవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు . ఇందులో భాగంగా ఎక్స్పరిమెంట్ నెంబర్ 2 అండ్ 4 లో ఫామ్-2 నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ ఓబులేసు , అసిస్టెంట్ డైరెక్టర్ .ప్రహ్లాద ఎ. ఎస్ ఓ. ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వై.మణి మోహన్ రెడ్డి , వీఆర్వో టి. బాలన్న , విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ బి.జేత శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190